# గుంపు

— డి. సుజీతాదేవి



"ఏమిటంత డల్‌గా వున్నావు?"

లత ప్రశ్నతో ఉలిక్కిపడిన సుమన "పాపాయికి బావుండలేదు" అంది నెమ్మదిగా.

"మీ వారింట్లో వున్నారా మరి"

"సెలవు పెట్టి వస్తానని వెళ్ళారు. వచ్చారో లేదో! మా చెల్లెలుందనుకో" దిగులుగా అంది సుమన.

"అసలు పాపాయి కాస్త పెద్దయేంత వరకూ నువ్వింట్లోనే వుండాల్సింది" అంది లత.

సుమన ఆ మాటకు జవాబేమీ చెప్పకుండా తల వంచుకుంది. మళ్ళీ తలెత్తి లతను నిదానించి చూసి నవ్వుగా నవ్వింది.

'నీకు మాత్రం ఉద్యోగం ఎందుకూ, హాయిగా పెళ్ళి చేసుకుని అత్తారింటికి వెళ్ళక?' అంటున్నట్టుగా ఆ నవ్వును చదువుకుంది లత.

"అవున్లే మనం ఒద్దనుకున్నప్పుడు పోయి కావాలను కున్నప్పుడొస్తాయా ఉద్యోగాలు" అంటూ తనలో తానే అనుకుంది లత.

వాళ్ళిద్దరూ ఓ మల్టిపుల్ డిపార్టుమెంటు స్టోర్సులో సేల్స్ గరల్స్, లత సీనియర్, సుమన జూనియర్. లత పెళ్ళి కావలసిన పిల్ల. సుమన ఆరు నెలల పాపాయికి తల్లి మందహాస వదనంతో మౌన భూషణాలతో పొందిగ్గా వుండే సుమనంటే లతకు చాలా ఇష్టం. అల్లరి నవ్వులు చిమ్ముతూ అందరికీ తలలో నాలుకలా వుండే ప్రవాహం లాంటి లతంటే సుమనకు ప్రాణ సమానం.

హడావిడిగా సేల్స్ సూపర్ వైజర్ వచ్చాడు. పాపాయి పరిస్థితి చెప్పి ఆ పూటకు పర్మిషన్ అడిగింది సుమన. కుదరదంటే కుదరదన్నాడు. చివరకు సుమన కన్నీళ్ళతో తల వంచుకునేసరికి 'ఎం.డి' గారొచ్చి వెళ్ళాక ఒక్క గంటలో వెళ్ళి రమ్మని అనుగ్రహించాడు.

"ఇలా సెలవులు పెడితే నష్టపోతావు. ఇంకెప్పుడూ పెట్టకు" హెచ్చరించింది లత సూపర్ వైజర్ వెళ్ళాక.

"నష్టమేమిటి? ఈ పూట జీతమా?" నిరసనగా అంది సుమన.

"అయ్యో ఎక్కడో పిచ్చిదానిలా వున్నావు. నువ్వు సెలవు పెడితే నీ కౌంటర్లో ఎవర్నో తెచ్చి పెడతారు. వాళ్ళు సరుకులమ్మి బిల్లు వ్రాయక పోయినా ఏమైనా ఇంటికి పట్టుకెళ్ళినా నీ పని సరి!"

"అట్లా కూడా జరుగుతుందా?"

"అవును. పోయినేడు నాన్నగారు పోయినప్పుడు 15 రోజుల సెలవు పెట్టాను. పోతే పోయింది సగం జీతం అనుకున్నాను. కాని ఆ తరువాత ఆరు నెలల వరకూ సగం జీతమే తీసుకోవాల్సి వచ్చింది" అంది లత.

"అయ్యో! అప్పుడు నీ కౌంటర్లో ఎవరున్నారో అడక్కపోయావా?"

"ఎవర్నని అడగను? క్లాత్ సెక్షన్‌లో ప్రావిజన్సులో ఎక్కువ మంది వుంటారు. వాళ్ళు బిజీగా వుంటే ఆఫీసు నుంచో గోడౌన్ నుంచో ఎవర్ని బడితే వాళ్ళని పెడతారు. అసలే హఠాత్తుగా నాన్నగారు పోవడం, పరామర్శతో చుట్టాల తాకిడి. కర్మలు. ఇక్కడ నష్టం ఈ లైబిలిటీ-అబ్బ! ఎందుకదుగుతావులే"

ఇంకేం గుర్తుకొచ్చాయో లత కళ్ళు తడిశాయి.

"పోన్లే ఊరుకో ఆ రోజులు పోయాయి గదా?" ఓదార్పుగా అంది సుమన. తను మనసాపుకోలేక తీసు కెళ్ళిన మాక్స్ ఫాక్టర్ మేకప్ సెట్ ఖరీదు ఎప్పుడో తన జీతంలో కట్టవుతుందన్న మాట అనుకుంది సుమన.

ఇద్దరూ మళ్ళా కబుర్లలో పడ్డారు. ఆ కబుర్లలో ఇంటి పరిస్థితులు, వాటితో రాజీ, నిధిలేని ఉద్యోగం, దాంట్లోని కష్ట నిష్ఠూరాలు, సాయంత్రమయ్యే సరికి గుమ్మంగా ముస్తాబై భర్తలతో షాపింగ్ కొచ్చే ఆడవాళ్ళ మీద అసూయ. ఉదయం నుంచి రాత్రి వరకు నిలువు కాళ్ళ మీద నిలబడే సేల్స్ గరల్ ఉద్యోగం మీద, భవిష్యత్ మీద రవంత ఆశ! ఆ ఆశల గమ్యం లతకు పెళ్ళి కావడం. సుమనకు ఓ ఏడాది సేల్స్ గరల్‌గా చేశాక ఇస్తానన్న టైపిస్టు ఉద్యోగం రావడం, ఇంకా ఎన్నెన్నో ఆ కబుర్లలో దొర్లి పోతున్నాయి.

గొంతు చించుకుని అరుస్తున్న పసిపిల్ల ఏడుపుతో ఈ లోకంలోకి వచ్చారు. కస్టమర్స్ ఎవరో చిన్న తోపుడు బండిలో పాపాయిని రిసెప్షన్ దగ్గర వదలి లోపలికి వెళ్ళినట్టున్నారు. ఆ పాప గుక్కపట్టి ఏడుస్తోంది. పసిపిల్ల బెలూన్లు చూపించి గిలక్కాయలు మోగించి, సముదా యించాలని చూస్తోంది. అయినా ఏడుస్తోంటే బిక్క ముఖంతో దిక్కులు చూస్తోంది.

"పాపం ఆకలేస్తోందో ఏమన్నా కుట్టిందో...అంతలా ఏడుస్తోంది" జాలిగా చూస్తూ అంది లత.

సుమనకు తన పాప గుర్తొచ్చింది. మామూలుగా అయితే బానే వుంటుంది కాని జ్వరం కదా! ఇలాగే ఏడుస్తూందేమో. ఆయనకు శెలవు దొరికిందో లేదో ఇలాగే... ఈ పాపలాగే గుక్కపట్టి ఏడుస్తుందేమో ఏడ్చి ఏడ్చి వెక్కిళ్ళొచ్చి - అమ్మో.... సుమనకు దుఃఖమొచ్చింది.

"మీ చెల్లెలు మరీ చిన్నపిల్ల కాదుగా ఖంగారు పడకు" అంది లత ఊరడింపుగా.

ఆ పాప ఏడుస్తూనే వుంది. ఎం.డి. గారొచ్చిన సందడి మొదలైంది.

నలుగురు హడావిడిగా వచ్చారు హవాయి చెప్పులు కావాలని. లత ఉత్సాహంగా లేచింది.

వాళ్ళు బాటాని కావాలన్నారు.

బాటాలో సైజుల్లేవని చెప్పలేదు లత.

"ఆ కొత్తగా వచ్చిన రిబ్‌జీన్స్ తీసుకురా" అని హెల్పర్‌కు పురమాయించింది.

